క్లుప్తంగా

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో స్వామివారి 37వ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నామని అయ్యప్ప సేవా సమాజ అధ్యక్షుడు శేషగిరిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

సుధాకర్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు రూరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా సుధాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. నగరంలోని ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ నేతలు నేతాజీ సుబ్బారెడ్డి, వాకర్స్ గవర్నర్ ఎమ్వీ రెడ్డి, రవీంద్ర, బలరామనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'కేఎన్నార్'లో మాక్ పరీక్ష



నెల్లూరు (టౌన్): బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్లో ఎన్నెమ్మెమ్మెస్ మాక్ పరీక్షను స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్ష పత్రాన్ని ఆవిష్కరించారు. హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు మురళి, ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్, స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యాయులు అరుణ, లక్ష్మణరావు, మల్లికార్జునశర్మ, నారాయణరెడ్డి, మూర్తి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బంగారంతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాలను తయారు చేయించేందుకు ఇచ్చిన బంగారంతో నిందితుడు ఉడాయించారు. పోలీసుల సమాచారం మేరకు.. నవలాకులతోటలోని రామచంద్రారెడ్డినగర్‌కు చెందిన అబ్దుల్ హఫీజ్ కొరడావీధిలో బంగారు నగల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మిథున్ కొరడావీధిలో నివాసం ఉంటూ కమీషన్ పద్ధతిపై వ్యాపారులకు ఆభరణాలను తయారు చేసి ఇచ్చేవారు. ఆయనకు బంగారాన్ని అబ్దుల్ హఫీజ్ ఇచ్చి ఆభరణాలను తయారు చేయించేవారు. ఇటీవల 230 గ్రాములను మిథున్‌కు ఇచ్చారు. సదరు బంగారుతో నిందితుడు ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువకుడు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మర్రిపాడుకు చెందిన ఇస్మాయిల్ నిడిగుంటపాళెంలోని బంధువుల ఇంటికి ఈ నెల 13న వెళ్లారు. అనంతరం హరనాథపురంలోని మామ ఇంటికెళ్లి.. అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. స్నేహితులను విచారించగా, ఇస్మాయిల్‌కు రూ.నాలుగు లక్షల మేర అప్పులున్నాయని, అందుకే ఎటైనా వెళ్లి ఉంటారని తెలిపారు. ఈ మేరకు యువకుడి సోదరుడు ఖాదర్‌వలీ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటన పెన్నానది ఏటి కట్ట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. వారధి సంఘానికి చెందిన పెంచలయ్య అదే ప్రాంతానికి చెందిన లోకేష్‌తో కలిసి పెన్నానది ఏటికట్ట వద్ద మద్యాన్ని ఆదివారం సేవించారు. మద్యం మత్తులో లోకేష్ ఏదేదో మాట్లాడుతుండగా, పెంచలయ్య వారించి ఇంటికెళ్లమని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన లోకేష్ తన అనుచరులు విల్సన్, రామకృష్ణ, వంశీని పిలిపించుకొని పెంచలయ్యపై దాడి చేశారు. విషయాన్ని గమనించి అడ్డుకోబోయిన పెంచలయ్య భార్య తిరుపతమ్మను నానా దుర్భాషలాడారు. ఇటుక రాళ్లతో ఇంటిపైకప్పు రేకులను పగలగొట్టారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు తిరుపతమ్మ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన నక్కలోళ్ల సెంటర్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. మర్రిపాడు మండలం ఉమ్మాయిపల్లికి చెందిన మోహన్‌రావు(48), రమణమ్మ దంపతులకు సరస్వతి, నీలావతి కుమార్తెలు. వీరికి వివాహమైంది. అందరూ కలిసి నవాబుపేటలోని రామచంద్రాపురంలో మూడేళ్లుగా నివాసం ఉంటున్నారు. బేల్దారి పనులు చేసే మోహన్‌రావు అరవింద నేత్రాలయ సమీపంలోని టిఫిన్ అంగడి వద్ద నిర్మాణ పనులకు తన సహచరుడు శేషయ్యతో కలిసి వచ్చారు. పనులు ముగించుకొని ఇంటికి బయల్దేరారు. నక్కలోళ్ల సెంటర్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో ఆయన ఎగిరి పక్కనే ఉన్న కల్వర్టు వద్ద పడి మృతి చెందారు. విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు శేషయ్య తెలియజేశారు. అల్లుడు హరీష్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న సంతపేట, రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి ఆరాధన



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని వాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మండపంలో త్యాగరాజ స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 108 మంది విద్యార్థినులతో 21 మంది సంగీత ఉపాధ్యాయులు 21 వీణలపై త్యాగరాజ స్వామి వారి సంకీర్తనలను ఆలపించారు. అనంతరం తీర్థప్రసాదాన్ని అందజేశారు. కల్యాణ మండప పాలకమండలి కార్యదర్శి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లుగుప్తా, గౌరవ సలహాదారు కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి వెంకటరత్నం, వెంకయ్య, మస్తాన్‌రావు, ఆంజనేయులు, శ్రీహరిప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న రమణారెడ్డి

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక సంఘం తమదని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు, పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై పలు ఉద్యోగ సంఘాల నేతలతో చర్చా వేదికను నగరంలోని ఐఎంఏ హాల్లో ఏపీజీఈఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ సంఘాల నేతలు ఏకతాటిపై నిలవకుండా ఎవరిదారి వారిదే అనే రీతిలో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై తమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ స్పందిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. పీఆర్టీయూ రాష్ట్ర నేతలు నాగేంద్రకుమార్, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేంద్రనాథ్ రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు శశిధర్, ఏపీజీఈఏ జిల్లా కోశాధికారి రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



నెల్లూరు (టౌన్): కిమ్స్ ఆస్పత్రి సమీపంలోని నగర పాలక పాఠశాలలో నేత్ర వైద్యశిబిరాన్ని బీటీఏ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. ఆస్పత్రి అధినేత రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో వైద్యశిబిరాన్ని నిర్వహించడాన్ని అభినందించారు. బీటీఏ వ్యవస్థాపకుడు రమణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, అదనపు కార్యదర్శి ఆదినారాయణ, ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి రమేష్, ఆడిట్ సెక్రటరీ మాల్యాద్రి, జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి, రాష్ట్ర మహిళా కార్యదర్శి స్టెల్లా, తదితరులు పాల్గొన్నారు.

కోటమిట్టలో ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): నగరంలోని 48వ డివిజన్లో గల కోటమిట్టలో ఉచిత వైద్య శిబిరాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిఖ్, ఎన్నెమ్మీ చారిటీస్ అధినేత నిజాముద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మీరా, కార్పొరేటర్ కరిముల్లా హాజరయ్యారు.

ఆర్టీసీ డిపోలో మెయింటెనెన్స్ డే



ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న మురళీకృష్ణ

నెల్లూరు(క్రైమ్): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపోలో వాహనాల మెయింటెనెన్స్ డేను ఆదివారం నిర్వహించారు. భద్రత పరంగా డిపోలోని అన్ని వాహనాలను డీఎం మురళీకృష్ణ, ఎమ్మెఫ్ గార్డ్ స్టోర్స్ ఇన్‌చార్జి, తదితరులు తనిఖీ చేశారు. చిన్న లోపాలను సరిదిద్దారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడారు. వాహనాల్లో వస్తున్న మార్పులకనుగుణంగా డ్రైవర్లు శిక్షణ పొందాలని కోరారు. మెయింటెనెన్స్ విభాగంలో ప్రతిభ చూపిన బిగ్, లైట్ వెహికల్స్ మెకానిక్ నవాజ్, వెల్డర్ నిజాముద్దీన్, కోచ్ బిల్డర్ సెల్వమ్, అసిస్టెంట్ మెకానిక్ భార్గవ్ కుమార్‌ను అభినందించి ప్రశంసపత్రాలను అందజేశారు.

వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



నెల్లూరు(వేదాయపాళెం): రామ్మూర్తినగర్‌లోని దేవాంగ సంక్షేమ సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన దేవాంగుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడారు. దేవాంగుల సంక్షేమానికి తమ సంఘం పాటుపడుతోందని చెప్పారు. వివాహ పరిచయ వేదికకు భారీగా హాజరయ్యారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్రాంత బ్యాంక్ మేనేజర్ మోహన్‌రావు, దేవాంగ సంఘ నేతలు సతీష్, వెంకటసురేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌నాయుడికి అవార్డు



నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్, రక్తదాన మోటివేటర్ భాస్కర్‌నాయుడికి జెమ్ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. చెన్నైలోని జీఆర్టీ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో మదర్‌థెరీసా, జేబీఆర్ హార్వర్డ్ వర్సిటీల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మైండ్ గ్రోత్ డెవలప్‌మెంట్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డును మదర్ థెరీసా వర్సిటీ చాన్సలర్ విజయసరస్వతి అందజేశారు. ఈ అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



చిత్రకారుడు శేషబ్రహ్మానికి సత్కారం

నెల్లూరు(బృందావనం): అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి బాలల చిత్ర కళాపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని పురమందిరంలో ఆదివారం నిర్వహించారు. బాలచిత్ర కళారత్న విభాగంలో ప్రతిభ చూపిన సాయి సహశ్రీ (సాయిమహావిద్యాలయ), సాత్విక్ (శ్రీచైతన్య టెక్నో స్కూల్, రాజమహేంద్రవరం) స్వర్ణ పతకాలను దక్కించుకున్నారు. అనంతరం చిత్రకారులు శేషబ్రహ్మం (ఒంగోలు), బయ్యన్న (హైదరాబాద్), పెంచలదాసు (జానపద గాయకుడు), డాక్టర్ బాబు (క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు)ను సత్కరించారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, చిత్రకారులు అమీర్‌జాన్, అన్నపూర్ణ, సునీతారవి, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, రత్నం, భాస్కర్, శ్రీనివాసులు, రమణ, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాపూజీకి కళా నివాళి



నెల్లూరు(బృందావనం): మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని హరనాథపురానికి చెందిన ఉపాధ్యాయుడు, కళాకారుడు పద్మారత్నం కళాత్మకంగా నివాళులర్పించారు. రావి ఆకుపై గాంధీ షాడో ఆర్ట్‌ను తీర్చిదిద్దారు. గంట వ్యవధిలో వాటర్ కలర్స్‌తో తీర్చిదిద్దానని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సరస్వతీనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు వెస్ట్ – 1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీనగర్, క్రాంతినగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

పూరిల్లు దగ్ధం



నెల్లూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన గుండ్లపాళెంలో చోటుచేసుకుంది. వివరాలు.. నాగేశ్వరరావు దంపతులు కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. బంధువుల ఇంట్లో శుభకార్యానికి శనివారం వారు వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, ఇంట్లోని గృహోపకరణలు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను మంగళవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హ్యావెల్స్ ఇండియా లిమిటెడ్, సంగీతా మొబైల్స్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, తదితర కంపెనీలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రికల్, మెకానికల్, వెల్డర్), ఇంటర్, ఏదైనా డిగ్రీ వారు అర్హులని చెప్పారు. స్టోర్ మేనేజర్, క్యాషియర్, కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ప్రమోటర్స్, టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పోస్టులకు ఎంపిక చేయనున్నారన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం

నెల్లూరు (టౌన్): సీపీఎస్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థులు బాబూరావు, వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చలపతి, శేషు, నేత అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'దాతలకు కళావందనం'

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ సమావేశ మందిరంలో దాతలకు కళావందనం కార్యక్రమాన్ని ఏ ట్రస్ట్ ఫర్ ఆల్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దాతల ఘనకీర్తిని వివరిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పది మంది దాతలను సత్కరించారు. అనంతరం భక్తి గీతాలు, పాటలు, కవితల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. సమాజ సేవకుడు ప్రదీప్, లక్ష్మీనరసింహప్రసాద్, రాయప్ప, మురళీమోహన్‌రావు, రఘు, జయప్రకాష్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వికాస్ ఆరోగ్య దీపికకు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి బాలాజీనగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ రూ.10 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని పేదలకు ప్రతి నెలా రూ.50 వేల విలువజేసే మందులను దాతల సహకారంతో అందజేస్తున్నామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 28వ డివిజన్లోని చైతన్యపురి కాలనీలో గల పార్కులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నామని చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్ అహల్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సాయిసునీల్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మేయర్ స్రవంతితో కలిసి ఆదివారం ప్రారంభించారు. రక్తాన్ని రెడ్‌క్రాస్, నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించారు. సొసైటీ అధ్యక్షుడు విజయభాస్కర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వేణుగోపాల్ రెడ్డి, రక్తదాన మోటివేటర్ భాస్కర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కాయిన్స్ ప్రదర్శన



నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డు పార్థసారథినగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో నిర్వహిస్తున్న పురాతన కాయిన్స్, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. ఏర్పాట్లను పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి పర్యవేక్షించారు. విజయవాడకు చెందిన న్యూమిస్మాటిక్ అండ్ ఫిలాటిక్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుఖదా దాస్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు రూరల్: నగరంలోని 21వ డివిజన్లో గల ఉమ్మారెడ్డిగుంటలో రూ.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు సంబంధించిన శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కార విషయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ గౌరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా సూచించారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ, డీసీ, కేడీ, సస్పెక్టెడ్ షీటర్లకు ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. రౌడీయిజం చేసినా.. ఘర్షణలకు పాల్పడినా సహించేదిలేదని స్పష్టం చేశారు. ప్రవర్తన మార్చుకొని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేసి వెళ్లాలన్నారు. పాత వ్యవహారాలకు స్వస్తి పలికి పద్ధతిగా జీవిస్తున్నారని తెలిస్తే రౌడీషీట్లు తొలగించే అంశమై ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. క్రాంతినగర్ వద్ద గతేడాది సెప్టెంబర్ ఆరున నిర్వహించిన వినాయక నిమజ్జన ఊరేగింపులో అదే ప్రాంతానికి చెందిన లోకేష్‌కుమార్‌తో ఆటోనగర్, మనుమసిద్ధి నగర్, పడారుపల్లి ప్రాంతాలకు చెందిన సాయికుమార్, జకీర్, చక్రధర్ గొడవపడ్డారు. స్థానికులు సర్ది చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి టిఫిన్ చేసేందుకు ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వచ్చిన లోకేష్‌కుమార్‌పై నిందితులు దాడి చేశారు. ఈ మేరకు చిన్నబజార్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసును నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ – 2 డీఎస్పీ శ్రీనివాసరావు కేసు విచారణ చేపట్టారు. ఘటన జరిగిన కొద్దిరోజులకే సాయికుమార్, జకీర్‌ను అరెస్ట్ చేశారు. తాజాగా చక్రధర్‌ను డీఎస్పీ అరెస్ట్ చేశారు.


నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(బృందావనం): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా విభాగ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని మైపాడు గేట్ సమీపంలోని కేపీఆర్ గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ మాజీ సభ్యుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ చైర్మన్ టీజీ వెంకటేష్, మహాసభ చైర్మన్ రామకృష్ణ, సభకు విచ్చేసిన పెద్దలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ప్రవీణ్‌శంకర్, సభ్యులను అభినందించారు.

శ్రీనివాసులురెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నోటిని అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ హితవు పలికారు. ఆదిత్యనగర్‌లోని నుడా పార్కులో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌పై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేదిలేదని స్పష్టం చేశారు. స్నేహితుల మధ్య గొడవను ఎమ్మెల్యేపై రుద్దాలని యత్నించిన శ్రీనివాసులురెడ్డికి భగవంతుడు విధించిన శిక్షను గుర్తుచేసుకోవాలని సూచించారు. కాలు విరిగి ఇంట్లో కూర్చున్న ఆయన ఎమ్మెల్యేపై ఇష్టానుసారంగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. వయస్సుపైన పడి మతిభ్రమించి ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. లోకేష్ చేపట్టిన పాదయాత్ర పేరును సైతం సక్రమంగా పలకలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు. నగర నియోజకవర్గంలో టీడీపీ తరఫున ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకునే సత్తా ఉందానని ప్రశ్నించారు. సమావేశంలో యువజన విభాగ నగరాధ్యక్షుడు జయకృష్ణారెడ్డి, అఖిల్, సాకేష్‌రెడ్డి, అగ్నేష్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.